క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత



మాగనూర్: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ మండలం గుర్లపల్లికి చెందిన రాగుల తమ్మప్ప, రాగుల అశోక్ నెరడగం పెద్దవాగు నుంచి అనుమతులు లేకుండా మక్తల్‌కు ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్లను స్థానిక రైతులు పట్టుకుని పోలీసులకు సమాచారం అందించగా, సిబ్బంది చేసుకుని రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లు, యాజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని ఎంపీటీసీ సభ్యుడు శివ కోరారు. మంగళవారం పాఠశాల తనిఖీకై వచ్చిన స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సత్యనారాయణకు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో 270 మంది విద్యార్థులు చదువుతుండగా కేవలం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి



కోస్గి: గతంలో ఎన్నికల సందర్భంగా కోస్గిని రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామి ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నేటికి హామీని నెరవేర్చడం లేదని, ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ ప్రసాద్, అంబదాస్, అమృత్‌రెడ్డి, వెంకటేష్, అంజి, చెన్నప్ప, వసంత్‌రావు పాల్గొన్నారు.

దామరగిద్ద: గత ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓంప్రకాష్, మండల అధ్యక్షుడు తిమ్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. మొగులప్ప, నర్సప్ప, వీరన్న, రంగయ్యగౌడ్, కన్కప్ప పాల్గొన్నారు.

విజ్ఞానమేళా



నారాయణపేట రూరల్: పట్టణంలోని సింగార్ బేస్ శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం విజ్ఞానమేళ నిర్వహించారు. 6,7,8 తరగతి చదువుతున్న విద్యార్థులు వివిధ అంశాలపై ప్రయోగాలను ప్రదర్శించారు. ముఖ్యంగా వర్షపునీరు ఒడిసి పట్టుకోవడం, గాలి ఒత్తిడి, వ్యర్థ పదార్థాల వినియోగం, సెన్సర్ల వినియోగంతో ప్రమాదాల నివారణ, సరికొత్త పరిశోధనలు, వేదగణితం తదితర అంశాలపై ప్రయోగాలు ఆకట్టుకున్నాయి.

పాథర్చేడ్‌లో ప్రతిష్ఠాపనోత్సవాలు



నర్వ: మండలంలోని పాథర్చేడ్ లక్ష్మీనర్సింహ స్వామి విగ్రహ, గరుత్మంత, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 31న, శాంతిపూజ, గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభవుతుందన్నారు. సెప్టెంబర్ 1న, యాగశాల ప్రవేశం, క్షేత్రపాలన, నవగ్రహపూజలు, సామూహిక హోమాలుంటాయన్నారు. 108 కలశాలతో పంచామృభిషేకం, సాయంత్రం గ్రామోత్సవం, 2న, యంత్రస్థాపన, ప్రాణప్రతిష్ట, మహా మంగళహారతి, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలుంటాయన్నారు. 3న ఎదుర్కోలు, 4న తెల్లవారుజామున జల్దిబిందే కార్యక్రమం అనంతరం 10:30గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం భక్తుల దాసంగాలు ఉంటాయన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



మక్తల్‌లో విద్యార్థుల ర్యాలీ



ధన్వాడలో నెట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మక్తల్: యువత క్రీడల్లో రాణించాలని రిటైర్డ్ పీఈటీ గోపాలం అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పట్టణంలో మంగళవారం సైక్లింగ్, షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. మినీ స్టేడియంలో తాన్‌సింగ్ క్రీడాజ్యోతిని వెలిగించారు. ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో గ్రామీణస్థాయి నుంచి జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదిగారన్నారు. దాదాపు 25 మంది పీఈటీలు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించారని దీనికి కారణం రిటైర్డ్ పీఈటీ గోపాలం కృషి ఉందన్నారు. అనంతరం అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారిణి అన్యశ్రీని శాలువతో సన్మానం చేశారు. కార్యక్రమంలో తాన్‌సింగ్, మంజుల, సునీత, శ్రీలత, అంబ్రేస్, అంజయ్య, శ్రీనివాసులు, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకుల పాఠశాలలో క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. వాలీబాల్, నెట్‌బాల్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు.

కోస్గి: ధ్యాన్‌చంద్ జయంతి నేపథ్యంలో నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండలంలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి దేశానికి ఆయన చేసిన సేవలను, తెచ్చిన గుర్తింపును కొనియాడారు.

క్రీడా పోటీలు..

ఊట్కూరు: మండల కేంద్రం, చిన్నపొర్ల, నిడుగుర్తి, పులిమామిడి పాఠశాలల్లో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. నిడుగుర్తి పాఠశాలలో పీఈటీ ప్రవీణ్‌ను సన్మానించారు. చిన్నపొర్ల పాఠశాలలో హాకీ బ్యాట్ ఆకారంలో విద్యార్థులు ప్రదర్శించారు.

క్రీడా దుస్తులు పంపిణీ

నారాయణపేట రూరల్: మండలంలోని జాజాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన కోట్ల ధీరజ్‌శ్యామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు దుస్తులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కనకప్ప, భానుప్రకాష్, మధుసూధన్, మాధవి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నర్వ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ పోస్టుకు ఎంపికైన సీపూర్ చెందిన నాగరాజుని శాలువాలతో సత్కరించారు. అనంతరం క్రీడల వల్ల కలిగే లాభాలను ఆ యువకుడు విద్యార్థులకు వివరించారు.



కోస్గిలో..



చిన్నపొర్ల పాఠశాలలో హాకీ స్టిక్ ఆకృతిలో..

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న హెడ్‌కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్

మాగనూర్: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ ఉమేష్‌గౌడ్ సూచించారు. మంగళవారం డయల్ – 100 సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం వాటికి యువత బానిసలు కాకూడదన్నారు. గ్రామాలలో సైబర్ నేరాగాళ్ల చూపే మోసపూరిత ఆశలకు గురికాకూడదని, సోషల్‌మీడియాలో వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, తక్కువ ధరకే ఆన్‌లైన్‌లో వస్తువులు దొరుకుతున్నాయని చాలా మంది తెలియకుండానే డబ్బులు పోగుటుకుంటున్నారన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930, 100 ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఎస్‌జీఎఫ్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులతో విజేతలు

దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో మంగళవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి ఖోఖో పోటీల్లో మొగుల్‌మడ్క ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్–14 బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలవగా, అండర్–17 బాలికల విభాగంలో ద్వితీయ స్థానంలో, అండర్–14 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన విద్యార్థులకు జీహెచ్‌ఎం బాలాజీ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు కతలప్ప, వెంకటప్ప, రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా నమోదు చేసుకోండి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

కోస్గి: ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైందని, 18ఏళ్ల వయస్సు నిండిన యువతి, యువకులు ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో బీఎల్‌ఓలు కొత్త ఓటర్ల జాబితాకు సంబంధించి అర్హులైన వారందరి నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారని, 18ఏళ్లు నిండిన వారు బీఎల్‌ఓల వద్ద, నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి భక్తమార్కండేయ స్వామి మహోత్సవాలు



నారాయణపేట టౌన్: భక్త మార్కండేశ్వర స్వామి మహోత్సవాల్లో భాగంగా రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భజన, జాగరణ నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు క్యాతన్ రఘునాథ్, శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటలకు మార్కండేయస్వామి మూలవిరాట్ విగ్రహానికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, బిల్వార్చన ప్రత్యేక పూజలను ఉంటాయని తెలిపారు. 9:30 గంటలకు యజ్ఞం, యజ్ఞోపవిత ధారణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 4గంటలకు స్వామివారి పల్లకీసేవా స్థానిక సుభాష్‌రోడ్ మార్కండేయ దేవాలయం నుంచి పట్టణ పురవీధుల మీదుగా పరిమాళపురం అనంతసేన దేవాలయ వరకు పల్లకీ సేవ ఉంటుందన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

నారాయణపేట: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ పర్సును పొగొట్టుకుంది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కనిపెట్టి తిరిగి అప్పగించారు. ఊట్కూర్ మండలం పెద్దజట్రం చెందిన పోర్ల పద్మమ్మ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి మంగళవారం వచ్చింది. టిఫిన్ చేసేందుకు చిల్డ్రన్ ఆస్పత్రికి వెళ్లి పర్సు మరిచి పోయింది. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కానిస్టేబుళ్లు శివ, రాములు చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దామరగిద్దకు చెందిన నర్సప్పకు దొరికినట్లు గుర్తించి ఆయనను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పర్సును స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న రూ.6,200 నగదు ఏఎస్‌ఐ బాలయ్య బాధితురాలికు అందజేశారు.

శాంతి భద్రతల పరిరక్షణకే ఫ్లాగ్ మార్చ్



కోస్గి: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పోలీసు శాఖ ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తుందని డీసీఆర్‌బీ డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం పట్టణంలో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ చేపట్టారు. రానున్న ఎన్నికలు, గణేష్ ఉత్సవాల నేపథ్యంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సర్కిల్ పరిధిలోని పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. స్థానిక శివాజీ చౌరస్తా నుంచి బహార్‌పేట వివేకానంద చౌరస్తా, అట్కార్ వీధి, సయ్యద్ పహాడ్, తెలుగు వీధి, చిన్న మసీద్, మార్కెట్ ఏరియా, శ్యాసం కాలనీ, బీసీ కాలనీ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకు అత్యాధునిక ఆయుధాలతో మార్చ్ కొనసాగింది. కార్యక్రమంలో ఆర్‌ఎఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాహుల్, సీఐలు జనార్దన్, శ్రీకాంత్‌రెడ్డి, రాబిన్ బాబు, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ బాలుఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు కవి రామ్మోహన్‌రావు, సీనియర్ తెలుగు టీచర్ చిన్నయ్యలను సన్మానించారు.

విద్యార్థులకు అండగా ఉంటా..



విద్యార్థులకు సైకిళ్లను అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

కృష్ణా: మండలంలోని కున్సి గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న బాలికలకు ప్రోత్సాహకంగా సైకిళ్లను అందించినట్లు తెలిపారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైతే ప్రత్యేక బహుమతులను ఇస్తామన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు రాంచందర్, ఉప సర్పంచ్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ శశికళ

మాగనూర్: విధులపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ శశికళ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలో ఉన్న హరితహారం, నర్సరీ, పండ్ల తోటల పెంపకం, పారిశుద్ధ్య పనులపై అధికారులు ఎట్టి పరిస్థితిలో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. జిల్లా అధికారులు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని లేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీఓ జైపాల్‌రెడ్డి, ఏపీఓ సత్యప్రకాష్, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణారెడ్డి, టీఏ ఊషన్న, హర్షవర్ధన్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రూ.18 వేల వేతనం ఇవ్వాలని నిరసన



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

నారాయణపేట: ఆశా కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్యాలయంలోని సిబ్బందికి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు బాల్‌రాం మాట్లాడుతూ ఆశాల సమస్యల పరిష్కారానికై ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం ఏ సర్వే అయిన ఆశాలతో చేయించుకుంటుందన్నారు. పారితోషకం పేరుతో పనిభారం మోపుతూ శ్రమ దోపిడికి గురిచేస్తున్నదన్నారు. పెండింగ్ పీఆర్‌సీ, ఎండీఏ, లెప్రసీ, ట్రెయినింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బాలమణి, జోషి, విజయలక్ష్మి, రాధిక, అంజమ్మ, శశికళ, అనురాధ, జ్యోతి, శాంతి, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే ఇంటి వద్ద ధర్నా చేపట్టారు. తమ సమస్యలను అసెంబ్లీలో లెవనెత్తాలని కోరారు. కార్యక్రమంలో పద్మ, శాంతమ్మ, జైనబి, శివలింగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

14వ రోజుకు చేరుకున్న ఏఎన్‌ఎంల సమ్మె

నారాయణపేట: రెండో ఏఎన్‌ఎంను రెగ్యూలరైజ్ చేయాలని చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 14వ రోజుకు చేరుకుంది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న మాట్లాడుతూ.. డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేంత వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. సావిత్రమ్మ, మంజుల, శోభ, వెంకటేశ్వరమ్మ, రామేశ్వరి, చంద్రకళ, సుజాత, లక్ష్మి, దేవిక, గిరిజ, అనురాధ, మణెమ్మ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధన్వాడ: మండలంలో వరుస చోరీల నేపథ్యంలో గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. ఎవరైనా ఇతర గ్రామాలకు, ఇల్లు తాళం వేసి వేళ్లేవారు ఇంటి పక్కల వారికి, స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు చొరవ చూపాలని సూచించారు. సర్పంచ్‌లు గ్రామాలలో చాటింపు వేయించాలని తెలిపారు.

ఎంపీడీఓకు సన్మానం

మాగనూర్: మండల ఎంపీడీఓగా శశికళ ఇటీవల బాధ్యతలు స్వీకరించగా, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ జైపాల్‌రెడ్డి మంగళవారం కార్యాలయంలో పూలమాల, శాలువలతో ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులను, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని అన్నారు.

నేడు సాయిమందిరంలో వేడుకలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సాయి హనుమాన్ మందిరంలో బుధవారం రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. షిర్డీ సాయిబాబాకు ఉదయం పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం ఉంటాయని, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళహారతి, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు పల్లకీసేవ ఉంటుందని భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలు జయప్రద్రం చేయాలని కోరారు.

31వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాలు

నారాయణపేట రూరల్: సార్వత్రిక విశ్వవిద్యాలయం ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్ చదువుకునే వారు ఈ నెల 31 వరకు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు గడువు ఉందని డీఈఓ రవిందర్ మంగళవారం తెలిపారు. టీఎస్ ఆన్‌లైన్, మీ సేవాలో ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బ్యాగులు, నోటుపుస్తకాలు అందజేత



ఊట్కూర్: మండల కేంద్రంలోని మిల్లత్ హైస్కూల్‌లో మంగళవారం యూసుఫ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మంజూర్ అహ్మద్ మాట్లాడుతూ వంద మంది విద్యార్థులకు కిట్లు అందించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కుర్షీద్ అహ్మద్, మగ్బుల్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు బహూకరణ



ఊట్కూర్: మండలంలోని నిడుగూర్తికి చెందిన బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రిషి కుమార్‌కు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హర్యాన గవర్నర్ బండారు దత్తత్రేయ చేతుల మీదుగా నందిఅవార్డును అందించారు. ప్రతి ఏడాది వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి అవార్డులు అందిస్తుంటారని ఆయన తెలిపారు.

ఘనంగా జీవేశ్వర్ జయంతి



నారాయణపేట: పట్టణంలోని సద్గురు అవధూత నరసింహస్వామి మఠంలో మంగళవారం జీవేశ్వర్ జయంతి వేడుకలను మఠం కమిటీ ఆధ్వర్యంలో కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పాదపూజ, రుద్రాభిషేకం, డోలారోహణం, యజ్ఞాపవిత్రధారణ, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తుల భజన సంకీర్తనలతో పురవీధుల్లో పల్లకీ ఊరేగింపు నిర్వహించారు.

గొర్రెల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



జిన్నారంలో పంపిణీ చేసిన గొర్రెలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మరికల్: గొర్రెల పెంపకంతో కాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జిన్నారంలో మంగళవారం అర్హులైన లబ్ధిదారులకు 13 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేసి మట్లాడారు. సబ్సిడీ గొర్రెలను రీసెల్ చేయకుండా సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్‌లో మంచి లాభాలు వస్తాయన్నారు. గ్రామానికి రావాల్సిన మరిన్ని యూనిట్లపై కాపారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గొర్రెలు తీసుకవచ్చే క్రమంలో అనేక ఇబ్బందులు రావడంతో ఆకలితో అలమట్టిస్తున్నామని వాపోయారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాస్కర్, పశువైద్యాధికారి మహదేవ్, రాజవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, చింతలయ్య, వాసుదేవ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అన్నిరంగాల్లో అభివృద్ధి

మక్తల్: అందరి సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో 14వ వార్డులో సీసీ రోడ్డుకు పనులను ప్రారంభించారు. పట్టణ అభివృద్ధికి రూ.3 కోట్ల 52 లక్షలను మంజూరు చేశామన్నారు. యల్లమ్మకుంట కాలనీల్లో వర్షం వస్తే కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకోసం రూ.10 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బాల్‌రాంనాయక్, కౌన్సిలర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ఊట్కూర్: మండల నాయీ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అశ్వినిఅశోక్ మాట్లాడుతూ మండలంలో నాయీ బ్రహ్మణులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఇల్లు లేని వారిని గుర్తించి గృహలక్ష్మి పథకాన్ని మంజూరు చేయాలని, బీసీ కులవృత్తులకు అందిస్తున్న రూ.లక్ష పథకాన్ని అర్హులైన వారికి అందించాలని, మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో తారకృష్ణ, రఘు, రాము, గోపాల్, శంకర్, దేవరాజ్, రవి, పవన్, పాల్గొన్నారు.